క్లుప్తంగా

నేడు, రేపు గంగ జాతర


మూడవ గేటు వద్ద జాతర ఏర్పాట్లు

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు నగరంలో పలు చోట్ల మంగళ, బుధవారాల్లో గంగజాతరను ఘనంగా నిర్వహించనున్నారు. మూడవ గేటు, మురుగానిపల్లి, ఇరువారం ప్రాంతాల్లో గంగ జాతరకు ఏర్పాట్లను పూర్తి చేశారు. మండపాన్ని విద్యుత్ దీపాలంకరణతో ముస్తాబు చేశారు. మంగళవారం ఉదయం అమ్మవారిని కొలువుదీర్చి తొలి పూజ చేయనున్నారు. భక్తులు ఊరేగింపుగా వచ్చి అంబలి పోసి విశేష పూజలు చేయనున్నారు. బుధవారం అమ్మవారిని నిమజ్జనం చేయనున్నట్లు జాతర నిర్వాహకులు పేర్కొన్నారు.

మొగిలిలో ఘనంగా రాహుకేతు పూజలు

బంగారుపాళెం: మండలంలో దక్షిణకాశీగా పేరొంది స్వయంభువుగా వెలసిన శ్రీ మొగిలీశ్వర స్వామి ఆలయంలో సోమవారం రాహు, కేతు, సర్పదోష నివారణ పూజలు ఘనంగా నిర్వహించారు. ఉదయం కామాక్షి సమేత శ్రీ మొగిలీశ్వరస్వామికి అభిషేకాలు, పూజలు చేపట్టారు. ధూపదీప నైవేద్యాలను సమర్పించిన తరువాత భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం ఆలయం ఆవరణలో ఉదయం 7.30 నుంచి 9 గంటల మధ్య రాహు, కేతు, సర్పదోష నివారణ పూజ కార్యక్రమాలను నిర్వహించారు. రాహుకేతు పూజా కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని దోషనివారణ చేసుకున్నారు. మధ్యాహ్నం భక్తులకు ఆలయం వారిచే అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి మునిరాజ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న నాకాబందీ


స్థానికులతో మాట్లాడుతున్న డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి

చిత్తూరు అర్బన్: జిల్లాలో కార్డెన్ సెర్చ్(నాకాబందీ)ను సోమవారం కూడా పోలీసుశాఖ కొనసాగించింది. ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో సెర్చ్‌ను జిల్లా వ్యాప్తంగా విస్తృతం చేస్తోంది. సమస్యాత్మక గ్రామాలను గుర్తించి అవగాహన సదస్సులు నిర్వహించింది. చిత్తూరు సబ్ డివిజన్ పరిధిలో డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి పూతలపట్టు, బంగారుపాళెం మండలాల్లో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. 20 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఒక టాటా ఏసీ వాహనాన్ని పట్టుకున్నారు. అనంతరం స్థానికులతో ఆయన మాట్లాడుతూ నిబంధనలను విరుద్ధంగా వ్యవహరిస్తే కఠినచర్యలు తీసుకుంటామన్నారు. యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఘర్షణలకు దూరంగా ఉండాలని సూచించారు.

స్థలవివాదం పరిష్కారానికి కృషి


గ్రామస్తులు, దళితులతో మాట్లాడుతున్న తహసీల్దార్ అరుణకుమారి

తవణంపల్లె: మండలంలోని మడవనేరిలో అమ్మవారికి పొంగళ్లు పెట్టడానికి ఏర్పడిన స్థల వివాదాన్ని పరిష్కరించడానికి కృషి చేస్తానని తహసీల్దార్ అరుణకుమారి తెలిపారు. మండల కేంద్రంలో సోమవారం మడవనేరి గ్రామస్తులతో చర్చలు జరిపారు. మడవనేరి దళితులు గ్రామ సమీపంలోని స్థలంలో తరతరాలుగా గంగమ్మకు పొంగళ్లు పెట్టి మొక్కులు చెల్లించుకోవడానికి వరించారు. అదే స్థలాన్ని గ్రామానికి చెందిన పెద్దరైతు ఆక్రమించుకొని ఫెన్సింగ్ వేశారు. దీంతో పొంగళ్లు పెట్టుకోవడానికి ఇబ్బందిగా ఉందని వెల్లడించారు. ఆక్రమణలు తొలగించి గంగమ్మకు పొంగళ్లు పెట్టుకోవడానికి స్థలాన్ని కేటాయించాలని గ్రామస్తులు కోరారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ దళితులు పొంగళ్లు పెట్టుకోవడానికి అనువుగా గేట్ తొలగించి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. సమావేశంలో మండల సర్వేయర్ బాబు, సీనియర్ అసిస్టెంట్ భాస్కర్, వీఆర్‌ఓ రాజేశ్వరి పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ.26 వేలు


హుండీ కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

తవణంపల్లె: శ్రీకాళభైరవేశ్వర ఆలయానికి హుండీ కానుకల లెక్కింపు ద్వారా రూ.26,080 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ వెంకటసుబ్బారెడ్డి తెలిపారు. ఆలయంలో సోమవారం ఎండోమెంట్ అధికారి సుమనప్రియ పర్యవేక్షణలో హుండీ కానుకల లెక్కింపు నిర్వహించారు. 80 రోజులకు హుండీల ద్వారా వచ్చిన కానుకలను లెక్కించినట్లు వివరించారు. కార్యక్రమంలో అర్ధగిరి ఆలయ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

క్రీడా శిక్షణలో..



క్రాఫ్ట్ కటింగ్ నేర్చుకుంటూ..



పుస్తక పఠనంపై శిక్షణ



వేసవి శిక్షణ.. వ్యక్తిత్వ వికాసం


క్యారమ్స్ ఆడుతూ..

చిత్తూరు కార్పొరేషన్: గ్రంథాలయాల్లో చేపట్టి వేసవి శిక్షణ శిబిరాలు విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి తోడ్పడుతున్నాయి. గతంలో గ్రంథాలయాలు అంటే కేవలం పుస్తక పఠనానికి మాత్రమే పరిమితం. ప్రస్తుతం విజ్ఞాన, వ్యక్తిత్వ వికాస కేంద్రాలుగా విరాజిల్లుతున్నాయి. ఇందులో భాగంగానే విద్యార్థులకు పలు అంశాల్లో శిక్షణ ఇస్తున్నారు. నగరంలోని గ్రంథాలయంలో ఈ నెల 15 నుంచి జూన్ 7వ తేదీ వరకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రణాళిక ప్రకారం వేసవి శిక్షణ తరగతులు ఏప్రిల్ 29న ప్రారంభం కావాల్సి ఉండగా, సార్వత్రిక ఎన్నికల కారణంగా ఈనెల 15న ప్రారంభమయ్యాయి. రోజూ ఉదయం 8 గంటల నుంచి 11.30 గంటల వరకు నిర్వహిస్తున్న విజ్ఞాన తరగతులకు విద్యార్థులు తరలి వస్తున్నారు. విద్యార్థులకు ఇంగ్లీషు గ్రామర్, లెక్కలు, అబాకస్, క్రాఫ్ కటింగ్, చదరంగం, క్యారమ్స్, డ్రాయింగ్ వంటి అంశాల్లో శిక్షణ ఇవ్వడంతో పాటు కథలు చెప్పడం, పుస్తక పఠనం ఎలా అనే అంశాలను నేర్పిస్తున్నారు. తరగతులకు హాజరయ్యే విద్యార్థులకు స్నాక్స్, మజ్జిగ ప్యాకెట్లు ఇస్తు న్నారు. శిక్షణ సందర్భంగా విద్యార్థులకు వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించనున్నారు.


ఆంగ్లం బోధిస్తున్న ఉపాధ్యాయులు

ఫ్యామిలీ డాక్టర్‌తో ఇంటివద్దే మెరుగైన వైద్యం


వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ అనూష

గుడిపాల: ఫ్యామిలీ డాక్టర్ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని బొమ్మసముద్రం డాక్టర్ అనూష అన్నారు. మండలంలోని కొత్తకోట గ్రామంలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. వివిధ వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు. అనంతరం ఇంటివద్ద మంచాన పడ్డ రోగుల వద్దకు వెళ్లి వారికి కావాల్సిన వైద్యసేవలను అందజేశారు. గర్భిణులు, బాలింతలకు వైద్యసేవలు అందించి పౌష్టికాహారం తీసుకోవాలని వారికి సూచించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది హైమావతి, తమరై, గీత పాల్గొన్నారు.

నేడు పాలేటమ్మ జాతర


విద్యుత్ దీపాలంకరణలో అమ్మవారి కటౌట్

ఐరాల: మండల కేంద్రంలో పాలేటమ్మ గంగ జాతరకు సర్వం సిద్ధమైంది. గంగమ్మ జాతర మంగళవారం వైభవోపేతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ వంశపారంపర్య ధర్మకర్త బాలాజి తెలిపారు. ఆలయ ఆవరణలో ఉదయం అమ్మవారి శిరస్సు ప్రతిష్ఠకు ప్రత్యేక షెడ్డు, దర్శనార్థం ప్రత్యేక క్యూలు ఏర్పాటు చేశామన్నారు. జాతర సందర్భంగా ఆలయ ప్రాంగణంలో సామూహికంగా అంబలిపోసి, పొంగళ్లు పెట్టి భక్తులు అమ్మవారికి నైవేద్యం సమర్పించనున్నారు. అనంతరం అమ్మవారి విశ్వరూప దర్శనానికి భక్తులను అనుమతించనున్నారు. ఈ మేరకు ఆలయ ప్రాంగణమే కాకుండా ప్రధాన వీధుల్లో అమ్మవారి దేవతామూర్తుల ప్రతిమలతో కూడిన విద్యుత్ దీపాలంకరణ ఆకట్టుకుంటోంది. సాయంత్రం భక్తుల కాలక్షేపం కోసం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు.

జాబ్‌మేళాకు 86 మంది ఎంపిక


ఉద్యోగ నియామకాలు పొందిన ఎస్వీ సెట్ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు

చిత్తూరు కలెక్టరేట్: జిల్లా కేంద్రానికి సరిహద్దులో ఎస్వీ సెట్ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన జాబ్‌మేళాలో 86 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని ఆ కళాశాల ప్రిన్సిపల్ మోహన్‌బాబు తెలిపారు. ఆ కళాశాలలో సోమవారం జాబ్‌మేళా నిర్వహించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఈ జాబ్ మేళాలో పాలిటెక్నిక్ పూర్తి చేసిన విద్యార్థులు, మూడవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు పాల్గొన్నారని చెప్పారు. చెన్నైలోని ప్రముఖ జోల్డీ కంపెనీ నిర్వాహకులు విద్యార్థులకు మౌఖిక, రాత పరీక్షలు నిర్వహించి ప్రతిభ చాటిన వారిని ఉద్యోగాలకు ఎంపిక చేశారన్నారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులకు ఉద్యోగ నియామక పత్రాలను అందజేసినట్లు తెలిపారు. అనంతరం ఆ విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ విజయకుమార్ పాల్గొన్నారు.

నగరంలో ప్రత్యేక పారిశుధ్య చర్యలు


అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో కమిషనర్

చిత్తూరు అర్బన్: రానున్న వర్షాకాలం నేపథ్యంలో పారిశుధ్య నిర్వహణ, నీటి సరఫరా, లీకేజీల నియంత్రణ కోసం వారం రోజుల పాటు ముందస్తు చర్యలు చేపట్టాలని నగర కమిషనర్ జె అరుణ సంబంధిత ప్రజారోగ్య, ఇంజినీరింగ్ అధికారులు, వార్డు కార్యదర్శులను ఆదేశించారు. వర్షాకాలం ప్రారంభం నేపథ్యంలో నగరంలో మొదటి దశలో ముందస్తుగా చేపట్టాల్సిన ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు, డ్రైనేజీల నిర్వహణ, నీటి లీకేజీలు, నీటి సరఫరా, సీజనల్ వ్యాధులు నియంత్రణ, అవగాహన కార్యక్రమాల నిర్వహణకు సంబంధించి నగర పాలక, వార్డు స్థాయిలో యాక్షన్ ప్లాన్ తయారీ, క్షేత్రస్థాయిలో అమలు అంశాలపై వీడియో సమావేశం ద్వారా సమీక్షించారు. కమిషనర్ మాట్లాడుతూ నగరంలో అన్ని మేజర్, మైనర్ డ్రైనేజీల్లో పూడిక తొలగించాలని, కల్వర్టులు, అండర్ పాస్లు, కెనాల్స్‌లో పిచ్చి మొక్కలు తొలగించి వర్షం నీరు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలన్నారు. షాపింగ్ కాంప్లెక్స్, మార్కెట్లు, బస్టాప్స్ ఇతర జన సమర్థ ప్రాంతాల్లో పారిశుధ్యం మెరుగ్గా ఉండాలని చెప్పారు. లోతట్టు ప్రాంతాలను గుర్తించి, నీరు నిలవకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, అవసరమైన ప్రాంతాల్లో కచ్చా కాలువలు సిద్ధం చేయాలని కోరారు. నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో ఆయిల్ బాల్స్ వేయాలని, స్ప్రేయింగ్, ఫాగింగ్ షెడ్యూల్ ప్రకారం చేయాలని సూచించారు. సెప్టిక్ ట్యాంక్ పైపులకు మెస్‌లు బిగించాలని, సీజనల్ వ్యాధుల నియంత్రణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి వార్డు స్థాయిలో నీటి సరఫరా పైప్‌లైన్లను పూర్తిస్థాయిలో తనిఖీ చేసి లీకేజీలు లేకుండా చూడాలని చెప్పారు. రోజువారీగా క్లోరిన్ పరీక్షలు నిర్వహించాలని, నీటి సరఫరా సక్రమంగా జరుగుతోందా లేదా పర్యవేక్షించాలని ఆదేశించారు. నగరంలోని నీటి శుద్ధి కేంద్రాలను డీఈలు, ఏఈలు తనిఖీలు నిర్వహించాలని పేర్కొన్నారు. వీధి దీపాల నిర్వహణ పక్కగా చేయాలన్నారు. వార్డు స్థాయిలో అడ్మిన్, అమినిటీ, శానిటేషన్, ప్లానింగ్, హెల్త్ కార్యదర్శులు సమన్వయంతో పని చేయడం ద్వారా వార్డుల్లో సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. సమావేశంలో సహాయ కమిషనర్ రామకష్ణుడు, ఎంఈ గోమతి, డీఈలు, శానిటరీ ఇన్స్పెక్టర్లు, ఏఈలు పాల్గొన్నారు.

నేడు బంగారుపాళెంలో గంగజాతర

బంగారుపాళెం: మండల కేంద్రంలో మంగళవారం గంగమ్మ జాతర కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించనున్నట్లు జాతర కమిటీ నిర్వాహకులు తెలిపారు. ఉదయం అమ్మవారికి అంబళ్లు, సాయంత్రం పొంగళ్లను నైవేద్యంగా సమర్పించనున్నట్లు తెలిపారు. రాత్రి అమ్మవారి శిరస్సును ఊరేగించనున్నట్లు తెలిపారు. మండలంలోని తగ్గువారిపల్లె పంచాయతీ ఆర్ఆర్‌నగర్‌లో గంగమ్మ జాతర నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గ్రామాల్లో విద్యుదీపాలతో అమ్మవారి కటౌట్లను ఏర్పాటు చేశారు.

వజ్రాలపురం గంగమ్మ జాతర ప్రారంభం


వజ్రాలపురంలో కలశపూజ

బంగారుపాళెం: మండలంలోని వజ్రాలపురంలో వెలసిన శక్తి స్వరూపిణి బోయకొండ గంగమ్మ 25వ జాతర మహోత్సవం సోమవారం ఘనంగా ప్రారంభమైంది. కార్యక్రమంలో భాగంగా ఉదయం అమ్మవారికి ప్రత్యేక అభిషేక పూజలను నిర్వహించారు. అనంతరం కలశ స్థాపన, ధ్వజారోహణ, గణపతి హోమం, చండీయాగ కార్యక్రమాలను చేపట్టారు. అనంతరం అమ్మవారికి పూజలు చేశారు. పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. భక్తి సంకీర్తనలు, కోలాట, భజనలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు ఆలయ ధర్మకర్తలు రాధమ్మ, కృష్ణప్ప, దీప, గోపి, చాతుర్య, పురుషోత్తం, మమత, ఈశ్వర్‌నాయుడు ఉభయదారులుగా వ్యవహరించారు. మంగళవారం అమ్మ వారికి అంబళ్లు, పొంగళ్లను సమర్పించనున్నారు. అనంతరం అమ్మ నిజరూప దర్శనం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ మేనేజర్ మొగిలప్ప, నిర్వాహకులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


హోమం నిర్వహిస్తున్న అర్చకులు, హాజరైన భక్తులు

థైరాయిడ్ దడ

- జిల్లాలో పెరుగుతున్న కేసులు
- చిన్నారులనూ వదలని వ్యాధి
- జీవనశైలి మార్పులే కారణమంటున్న వైద్యనిపుణులు

కాణిపాకం: శరీర జీవక్రియల్ని నియంత్రించే అతి ముఖ్యమైన గ్రంథి థైరాయిడ్. మనిషి వికాస క్రమంలో థైరాక్సిన్‌హార్మోన్ పాత్ర ఎంతో కీలకమైంది. అయితే, ప్రస్తుతం పుట్టిన బిడ్డ నుంచి తొంభై ఏళ్ల వయసు వారికి సైతం థైరాయిడ్ వ్యాధి సోకుతూ దడ పుట్టిస్తోంది. మనిషిని మానసికంగా, శారీరకంగా కుంగదీసే ఈ వ్యాధిపై సమగ్ర అవగాహన ప్రతి ఒక్కరికీ ఎంతో అవసరం. సంపూర్ణ అవగాహన, అప్రమత్తతతో థైరాయిడ్ వ్యాధిని జయించవచ్చని వైద్య నిపుణులు సూచిసున్నారు.

జిల్లాలో ఒక జిల్లా ఆస్పత్రి, 50 పీహెచ్‌సీలు, 14 అర్బన్‌హెల్త్ సెంటర్లు, నాలుగు ఏరియా ఆస్పత్రులు, 8 సీహెచ్‌సీలు ఉన్నాయి. ఒక్కో ఆస్పత్రికి ప్రతి రోజూ 15 నుంచి 30 మంది థైరాయిడ్ బాధితులు వస్తున్నారు. రోజుకు సుమారు వంద మంది వరకు చికిత్స కోసం వైద్యులను సంప్రదిస్తున్నారు. జనరల్ ఫిజీషియన్ తో పాటుగా ఇతర వైద్య నిపుణుల్ని రోజూ సంప్రదిస్తున్న బాధితుల సంఖ్య 250 మందికి పైగా ఉంటుందని అంచనా. జిల్లా ఆస్పత్రికి జనరల్ మెడిసిన్ వైద్య విభాగానికి రోజూ వైద్యం కోసం వచ్చే వారిలో 250 మందిలో 18నుంచి 25 మంది థైరాయిడ్ బాధితులే ఉంటున్నారు.

థైరాయిడ్ గ్రంథి పనితీరు

గొంతు ముందు భాగంలో శ్వాసనాళానికి ఇరుపక్కలా గులాబీ రంగులో ఇంచుమించు సీతాకోకచిలుక ఆకారంలో థైరాయిడ్ గ్రంథి ఉంటుంది. ఇది మెదడులోని పిట్యూటరీ గ్రంథి స్రవించే థైరాయిడ్ స్టిమ్యూలేటింగ్ హార్మోన్ (టీఎస్‌హెచ్) ద్వారా టి-3, టి-4 అనే హార్మోన్లను ఉత్పత్తి చేస్తుంది. టి-4 అనగా థైరాక్సిన్. ఇది 20 గ్రాముల బరువు ఉండి శరీరంలోని చాలా జీవక్రియల్ని నియంత్రిస్తుంది. శరీర పెరుగుదల, ఎముకల పెరుగుదల, శరీర ఉష్ణోగ్రత, మానసిక వికాసాన్ని అదుపు చేస్తుంది. వివిధ కణజాలాల అభివృద్ధికి తోడ్పడుతుంది. ఈ హార్మోన్ ఉత్పత్తికి మన శరీరంలో తగినంత అయోడిన్ అవసరం. రోజుకు 150 మైక్రో గ్రాముల (గుండుసూది తలంత) అయోడిన్ శరీరానికి అవసరం. థైరాక్సిన్‌లో 65 శాతం అయోడిన్ ఉంటుంది. అయోడిన్ పెరుగుదలకు, శక్తి రావడానికి తోడ్పడుతుంది.

థైరాయిడ్ లక్షణాలు

- ఈ వ్యాధి లక్షణాలు క్రమంగా బయటపడతాయి.
- ఈ వ్యాధి వచ్చిన వారిలో హుషారు తగ్గి, అంతకు ముందులేని మందకొడితనం చోటుచేసుకుంటుంది.
- విపరీతమైన అలసట, నడవాలన్నా, పనిచేయాలన్నా ఓపిక ఉండదు. చర్మంలో తడి, నునుపుదనం తగ్గి, ఎండిపోయినట్లు ఉంటుంది.
- కండరాలు ఉబ్బుతాయి. దానివల్ల శరీరం ఉబ్బుగా కనిపిస్తుంది. కొందరు ఉబ్బు కామెర్లుగా భ్రమపడే అవకాశం ఉంది.
- మలబద్ధకం, కండరాలు పట్టేసినట్లు ఉండటం, చర్మం కింద కొవ్వు చేరి బరువు పెరగడం.
- గొంతు బొంగురుగా మారడం, ముఖం గుండ్రంగా కనపడటం, మనిషి మందమతిగా మారడం.
- జీవక్రియ రేటు విపరీతంగా పెరిగి శరీరంలోని అన్ని శక్తి వనరులు ఖాళీ అవుతాయి.


గర్భిణికి చికిత్స చేస్తున్న వైద్యురాలు

- ఎముకల్లో కాల్షియం తక్కువై పెళుసుబారతాయి. తలమీద వెంట్రుకలు ఎక్కువగా రాలిపోతాయి.
- కనుబొమ్మల వెంట్రుకలు ఎక్కువగా రాలిపోతాయి.
- పిల్లలో పెరుగుదల ఉండదు. పిచ్చితనం వస్తుంది.
- లావు అవ్వడం, బరువు పెరగడం, మత్తు, నిద్ర, ఒళ్లునొప్పులు, మలబద్ధకం, స్త్రీలలో రుతుచక్రంలో మార్పులు రావడం, గర్భం రావడం ఆలస్యం కావడం, తరచుగా గర్భస్రావాలు జరగడం తదితర లక్షణాలు గమనించవచ్చు.
- రక్తంలో టి-3, టి-4, టీఎస్‌హెచ్ అనే హార్మోన్లు ఎంతున్నాయో పరీక్షలు చేస్తారు. దీన్నే థైరాయిడ్ ప్రొఫైల్ అంటారు. ఈ పరీక్షలు చేయించడం ద్వారా వ్యాధి ఉందా? లేదా? నిర్ధారణ చేస్తారు.

వ్యాప్తి ఇలా

- ఈ వ్యాధి అప్పుడే పుట్టిన బిడ్డ మొదలుకొని 90 ఏళ్ల వయస్సు వారికీ రావచ్చు.
- మగవారి కన్నా ఆడవారిలో ఎక్కువగా సమస్య తలెత్తుతుంది.
- ఆడవారిలో 80 శాతం మందికి ఉంటే మగవారిలో 20 శాతం మందికి వస్తుంది.
- జన్యుపర లోపాల వల్ల, తల్లికి ఉంటే బిడ్డకు, వంశపారంపర్యంగా వ్యాధి వస్తుంది.
- అప్పుడే పుట్టిన బిడ్డకు థైరాయిడ్ ఉందో లేదో నిర్ధారణ పరీక్ష చేయించడం చాలా ఉత్తమం.

అశ్రద్ధ వద్దు



థైరాయిడ్ వ్యాధి పట్ల అశ్రద్ధ ఉండకూడదు. లక్షణాలు కనిపిస్తే వెంటనే డాక్టర్లను సంప్రదించాలి. మహిళలు, చిన్నపిల్లల పట్ల మరింత జాగ్రత్తలు తీసుకోవాలి. సరైన సమయంలో చికిత్స తీసుకోవాలి. గర్భిణులకు వచ్చే థైరాయిడ్ ప్రసవం అనంతరం తగ్గిపోతుంది. వ్యాధి సోకిన వారికి ప్రత్యేకంగా లక్షణాలు కనిపించవు. ఒక్కొక్కరిలో ఒక్కో విధంగా ఉంటాయి.
–ఉషశ్రీ, గైనకాలజిస్ట్, జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి, చిత్తూరు

ముందుగానే తెలుసుకోవాలి



యాంటీబాడీ టెస్ట్ చేయించుకోవడం ద్వారా థైరాయిడ్ వ్యాధి వచ్చే అవకాశం ఉందా? లేదా? ముందుగానే తెలుసుకోవచ్చు. ఆహారంలో అయోడిన్ లోపం లేకుండా చూసుకోవడం వల్ల కొంత వరకు థైరాయిడ్ బారినపడకుండా కాపాడుకోవచ్చు. వ్యాధి నియంత్రణే తప్ప నివారణ లేదు. దీనికి జీవితాంతం మందులు వాడాలి. ముందుగానే గుర్తించడం మంచిది.
–షాలిని, గైనకాలజిస్ట్, జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి, చిత్తూరు

మండలాభివృద్ధికి కృషి చేయాలి


మాట్లాడుతున్న ఎంపీపీ మోహన్

ఐరాల: మండలాభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో కలిసికట్టుగా కృషి చేయాలని ఎంపీపీ మోహన్ అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. తొలుతగా గత నెల కామినాయనపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యుడు పట్టాభి మృతికి అధికారులు, ప్రజాప్రతినిధులు శ్రద్ధాంజలి ఘటిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం ఎన్నికల కోడ్ నేపథ్యంలో సర్వసభ్య సమావేశాన్ని ముగించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశు, వైఎస్ ఎంపీపీలు నిత్య, రోజా, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.